# సంధ్యారాగం

ముప్పాల లలితకుమారి




రాణి కల్పనను. నిన్ను కలిపి ఎంతమంది ఎలా అసహ్యంగా చెప్పుకుంటున్నారో - వాళ్ళ నోళ్ళు మూయించగలవా" అంది ఏడుస్తూ.

"సారీ మధూ నేనెళుతున్నా" కల్పన కన్నీళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయింది.

మౌనంగా తల దించాడు మధు.

"ఇంత జరిగినా ఇంకా నేను నీ దగ్గరే పడి వుంటాననుకున్నావా? మా యింటికి వెళ్ళిపోతున్నాను." టక్కున వెనుదిరిగి వెళ్ళిపోయింది సంధ్య. మధు కూడా ఆమె వెనకాలే ఇంటికి చేరేడు.

"చూడు సంధ్యా- ఏదో ఆవేశంలో చేయి చేసుకున్నాను. క్షమించు సంధ్యా. నీవు మీ యింటికి వెళ్ళొద్దు. భార్యాభర్త లన్న తరువాత చిన్న చిన్న కీచులాటలు రావటం సహజం. నీవు అలిగి ఇంటికి వెళితే, అందరిలోనూ మనం నవ్వులపాలవుతాము సంధ్యా."

"అయితే మీరు నవ్వులపాలు కాకుండా ఉండటానికి, మీరువేసే వేషాలు చూస్తూ సహించమంటారు. కొట్టినా, తిట్టినా కుక్కినపేనులా పడి ఉండమంటారు. అంతేనా! మీ చెప్పు కింద తేలులా పడి ఉండటానికి నేనేం చేతకాని దద్దమ్మను కాను. B.Sc వరకు చదివిన చదువుంది. ఎక్కడైనా ఉద్యోగంచేసి బతగలను- మీ కల్పనలా నీతిలేని పనులుచేసికాదు."

"సంధ్యా దయచేసి అలాంటి మాటలనకు. నేను భరించలేను. కల్పనకూ, నాకు ఎలాంటి సంబంధమూ లేదు. కేవలం స్నేహం మాత్రమే."

"హం! స్నేహమట! ఒక అమ్మాయికి ఒక అబ్బాయికి మధ్యవున్న స్నేహానికి అర్థం తెలియనంత అవివేకినేం కాదు నేను" విసురుగా అంది.

"సంధ్యా మనం ప్రేమించుకొని పెండ్లి చేసుకున్నాం. ఒకరినొకరు బాగా అర్థం చేసుకున్నాం, కష్ట సుఖాల్ని ఇద్దరం సమంగా పంచుకుందామని ఎన్నో బాసలు చేసుకున్నాం. అవన్నీ మరచిపోయి కేవలం ఒకమ్మాయితో మాట్లాడినంత




మాత్రాన. ఎవ్వరో ఏదో నన్ను అనుకుంటున్నారని. ఆ చెప్పుడు మాటలు నీవు కూడా నమ్ముతున్నావా? సంధ్యా ఇంతేనా నీవు నన్నర్థం చేసుకోగలిగింది. ఇదేనా నీ సంస్కారం?" నచ్చచెప్పటానికి ప్రయత్నిస్తున్నాడు మధు.

మౌనంగా కూర్చుంది సంధ్య.

"ఆ రోజు మా నాన్న నిన్ను పెళ్ళి చేసుకున్నందుకు తన ఆస్తిలో చిల్లిగవ్వ యివ్వనన్నప్పుడు-ఆ అమ్మాయికావాలో. నేను కావాలో తేల్చుకోమన్నప్పుడు అయిన వాళ్ళందరినీ వదులుకొని 'నా సంధ్య ఒక్కతే నాకు చాలు'నని వచ్చానే. నీవే నన్ను ఇలా బాధపెడతావా సంధ్యా? మా నాన్న 'మా అబ్బాయిని వదిలిపెడితే నీకు రెండు లక్షలు యిస్తాను' అన్నప్పుడు నీవేం అన్నావో గుర్తుందా? 'మీరు మా అత్తగారిని వదలిపెడతారా? అలా చేస్తే ఆ రెండు లక్షలు నేనిస్తాను' అనలేదూ. అపుడు నేనెంత గర్వపడ్డానో తెలుసా?"

"మీరు గర్వపడతారండీ. ఎందుకంటే ఈ సంధ్యను పెళ్ళి చేసుకొని బందీ చేశాను. ఇంకెక్కడికీ పోదు. బయట వేషాలు చూడబోయిందా! చూసినా ఏం చేస్తుంది? ఈ పూర్ సంధ్య. అని కదూ మీ అహంకారం."

ఎంతచెప్పినా, ఎంత సమాధాన పరుస్తున్నా వినిపించుకోని సంధ్యను చూసి ఏం చెయ్యాలో తెలియడం లేదు మధుకు— కొన్ని రోజులు వాళ్ళ యింటిలో వుంటే అన్నీ సర్దుకోవచ్చు అనుకున్నాడు తనలో.

"సంధ్యా ఈ పరిస్థితులలో మనం కొంతకాలం దూరంగా వుండటంమంచిది. ఆవేశం వదలి ఆలోచించటానికి టైముంటుంది. మనుష్యులు దూరమైతే మనస్సులు దగ్గరౌతాయంటారు. నీ యిష్ట ప్రకారమే మీ అమ్మగారింట్లో దింపివస్తాను. అక్కడైతే మీ అమ్మ, నాన్న, మీ చెల్లెళ్ళు, తమ్ముళ్ళమధ్య కొంత రిలీఫ్ వుంటుంది. కారు రడీ చేస్తాను బట్టలు సర్దుకో."

"అడ్డంలేకుండా హాయిగా కులకొచ్చని పంపిస్తున్నావా" మూర్ఖంగా, మొండిగా అంది.

"లేదు సంధ్యా! ఈ ఆవేశంలో నీవేం చేసుకుంటావోనని భయంగాఉంది. మనిషిని ఉద్రేకం ఎంతకయినా దిగజారుస్తుంది." ఆమె ఏమవుతుందోనని అతని దిగులు. ప్రేమతోపాటు అనుమానం ఆమెలో.

"నేను లేకుంటే మీకు హాయిగా ఉంటుందికదూ! ఆ కల్పనాదేవిని పెళ్ళి చేసుకొని నవ్వుతూ, ఆనందంగా కాలం గడుపుతారుకదూ!"

"అబ్బా! సంధ్యా నీకెలా చెప్పాలి?" అతని కళ్ళలో నీళ్ళు.

సంధ్యను వాళ్ళ ఇంటి దగ్గర దింపి తిరిగి వచ్చేముందు- "సంధ్యా."

సంధ్య మాట్లాడలేదు.

"ఒక్కటి మాత్రం నిజం. నేను నిర్దోషినని నీకు తెలుసు. ఎందుకిల్లా కక్ష తీర్చుకుంటున్నావో నాకర్థం కావడంలేదు. ఈ మధు మనస్సులో సంధ్యకు తప్ప ఇంకొక వ్యక్తికి చోటు లేదు- వస్తా సంధ్యా."

చివ్వున తలెత్తింది. మధు కంటిలో నీరా! బాధపడుతున్న మధును ఒక్కసారిగా హృదయానికి హత్తుకొని 'ఇంకెప్పుడూ బాధపెట్టను మధూ' అని చెప్పాలనిపించింది. వెంటనే అహం అడ్డుపడింది. 'వీల్లేదు-తాను ఓడిపోకూడదు-' మధు వెళ్ళినవైపే చూస్తుండిపోయింది.

వచ్చినప్పటినుంచి మౌనంగా, దిక్కులు చూస్తూ దిగులుగావున్న కూతురిని చూసి వెంకాయమ్మగారు "ఏమ్మా సంధ్యా అలా ఉన్నావు. వంట్లో బాగాలేదా? నలతగా ఉన్నట్లు కనిపిస్తున్నావు". అడిగింది ప్రేమగా.

"ఏమీలేదమ్మా మొన్న గారెలు వండుతుంటే బాణలిలో నూనె ఒలికి కాలిమీద పడింది. దానివల్ల కొంచెం ఫీవరిష్‌గా ఉన్నట్టుందమ్మా".

"అదేమిటమ్మా! అబ్బాయి డాక్టరయి ఉండి జ్వరమంటావు- మందులూ, ఇంజక్షన్లు వాడకూడదూ?"

నిజం తనకి తెలుసు- బాణలిలో నూనె ఒలికిపోలేదు. మధు మీద కోపంతో బాణలి ఎత్తి కింద పడవేసింది అది మధు మీద పడాలని- ఫలితం తన కాలు అంతా నూనె- మంటలూ- బొబ్బలు! అబ్బ ఎంత బాధ. అప్పుడు మధు ఎంత బాధపడిపోయాడో- మందులు వాడమని ఇచ్చినా వాడలేదు-


కాలికి మందు రాయబోతుంటే- కాలును విసురుగా లాక్కుంది. అయినా అనునయిస్తూ-

"సంధ్యా దయచేసి ఈ మందులు వాడు."

"ఏం! చావటానికిచ్చావా?"

"అవేం మాటలు సంధ్యా!" అన్నాడు బాధగా. అవన్నీ గుర్తొచ్చాయి సంధ్యకు.

అసలు సంధ్య మానసిక స్థితి ఏమిటో అర్థం కావటంలేదు మధుకు. ఆమెలో ప్రేమను మించిన అనుమానం వుంది. నేనెక్కడ దూరమౌతానోనని ఆమె బాధ. దూరంగా వుంటే దగ్గర కాలేదని బాధ. దగ్గరగా వస్తే ఏదో ఒక మాటతో బాధ పెడుతుంది. సైక్రియాటిస్ట్‌కు చూపించాలి అనుకుంటున్నాడు డ్రైవ్ చేస్తూ.




గంట కూడా కాకముందే వెళ్ళిన మధు దగ్గరికి. ఏలూరు వెళ్ళాలనిపించింది సంధ్యకు. అప్పటికే రాత్రి పది గంట లయింది. ఆలోచనలలో పడింది. తను వెళ్ళేటప్పటికి పన్నెండు గంటలు అవుతుంది. కల్పన యింటికి వచ్చి వుంటుంది. తప్పక ఇద్దరూ కలిసే వుంటారు. తన బెడ్ రూంలో తన బెడ్‌పై కల్పన - మధు. ఇక ఊహించలేకపోయింది. నిజంగా మధు అలా చేస్తాడా? అని ఒకవైపు - ఏమో మగవాళ్ళను ఎవరు నమ్మగలరు. కాంట్రడిక్షన్- పైకి లేచింది.

"అమ్మా."

'ఏమ్మా! పిలిచావా?' దగ్గరగా వచ్చింది వెంకాయమ్మగారు.

"తమ్ముడ్ని టాక్సీ మాట్లాడమను. నేను మా ఊరు వెళుతున్నా."

"ఇంత రాత్రివేళ ఎందుకే, పోనీ రేపు వెళుదువుగాని, అల్లుడుగారు కూడా నాలుగు రోజులు వుండమన్నారుకదా."

"ఏం లేదమ్మా వెళ్ళాలని వుంది. ఆయన ఆరోగ్యం బాగుండలేదు. అక్కడైతే నేను కూడా ట్రీట్‌మెంట్ తీసుకోవచ్చు" అంటూ చిన్నతమ్ముడు శరత్‌ని తీసికొని బయలుదేరింది.

టాక్సీ ఏలూరు చేరేసరికి పన్నెండున్నర అయింది. టాక్సీకి డబ్బు యిచ్చి, లాక్ చెయ్యని గేటు చూసి అనుమానంతో సరాసరి మేడపైకి వెళ్ళింది. బెడ్‌రూం క్లోజ్ చేసుకొని నిద్ర బోతున్నారు కాబోలు.

తలుపు చప్పుడు కావడంతో మధు తలుపుతీశాడు. ఎదురుగా సంధ్య. ఒక్క క్షణం ఆశ్చర్యపోయి వెంటనే నవ్వుతూ "ఇంత రాత్రిపూట ఒక్కదానివే వచ్చావా?" అడిగాడు.

అదేమీ సంధ్యకు విన్పించటంలేదు. మధు ఆకారం- చెరిగిన జుట్టు- నీరసంగా భయాందోళనతో కన్పిస్తున్న ఆకారం— ఆ ఆకారంవెనుక సంధ్యదృష్టి బెడ్‌వైపుకు నడిచింది. ఆమె ఊహిస్తున్నట్లే చెదరిపోయి నలిగిపోయిన బెడ్‌షీట్. గది అంతా పరిశీలిస్తున్నాయి సంధ్య కళ్ళు— బాత్‌రూంవైపుకు అప్రయత్నపు నడక— ఎవ్వరూ లేరే? తను ఊహించింది నిజం కాదా! అవమానంతో దహించుకుపోతూంది మధు తన తత్తరపాటును ఎక్కడ గమనిస్తాడో నన్న తపన.

'రేపు దయమే రావచ్చుగదా సంధ్యా.'

"ఏం! మళ్ళీ దాపురించిందేమిటా అని బాధగావుందా?"

"ఇప్పుడూ అనుమానమేనా? సరేలే. శరత్ వచ్చినట్లున్నాడు- కింద పక్క వేసి వస్తాను. నీవు పడుకో- అలసిపోయి నట్లున్నావు-" అంటూ కిందికి వెళ్ళాడు.

ఉదయమే శరత్ వెళ్ళిపోయాడు.

ఉదయం నుంచి సంధ్య కొంచెం సంతోషంగానే కన్పించింది. మధు ఆనందానికి అంతు లేదు. "హాస్పిటల్‌కి వెళ్దాం సంధ్యా."




* 2 సంగల అనుభవం కలిగిన సేల్స్ రిప్రజెంటేటివ్‌లు కావలెను

"త్వరగా రండి– నేను మా ఊరు వెళ్ళాలనుకుంటున్నాను."

"రాత్రేగా వచ్చావు- మళ్ళీ ఇప్పు డెందుకు. సరే మళ్ళీ ఎప్పుడొస్తావు."

"బహుశా రాననుకుంటా."

"సంధ్యా!(మౌనం, బాధ, ఆవేదనతో) సరే! త్వరగా వస్తాను. తర్వాత మాట్లాడు కుందాం."

సంఘర్షణ ప్రారంభమైంది ఆమెలో. మధుని ప్రేమించి పెళ్ళి చేసుకుంది. మధు ప్రేమంతా పూర్తిగా తన స్వంతమే కావాలి. అందులో ఇంకొకరికి భాగం ఉందన్న ఊహే భరించలేదు. నిప్పు లేనిదే పొగ రాదంటారు. మరి ఎందుకు మధుని, కల్పనను గురించి ఎందరో చెప్పేరు. కొందరు ఇద్దరూ కలిసి ఉండటంకూడా చూసేమన్నారు. మరి మధు ఏమీ లేదంటు న్నాడు. భగవాన్! ఏది నిజం! అను మానం. ప్రేమ మధ్య సంఘర్షణ. మధు అలా చెయ్యడు. చెయ్యలేదు–అనుకుంది. మరొక్కసారి చేశాడేమో — చెయ్యడని నమ్మకం ఏమిటి? అనుకుంటూంది. మరొక్కసారి మధు జీవితాన్ని నరకం చేస్తున్నానా? అనుమానంతో అనుక్షణం వేధిస్తున్నానా? ఏం చెయ్యాలి? బుర్ర బద్దలైపోతోంది సంధ్యకు. ఏదో పరి ష్కారం చూడాలి. లేకుంటే ఇద్దరి జీవి తాలూ అశాంతిపాలే. ఏం చెయ్యాలి అనే ప్రశ్న హృదయాన్ని మధించి పరిష్కారం కోసం వేధిస్తోంది.

"ఆత్మహత్య చేసుకుంటే?"

మనస్సు వ్యతిరేకిస్తూంది. దానికి ఫలితం అనుభవించేది ఎవరు? నేనే! కాదు. మధు కూడా అనుభవిస్తాడు. చచ్చి ఏం సాధి స్తాను? చావడం పిరికివారి లక్షణమంటారు. చదువుకున్న నేనే ఆత్మహత్య పరిష్కార మనుకుంటే, చదువుకోనివారి సంగతి ఏమిటి? చచ్చి ఏం సాధించాలి. అందుకే బతకాలి. ఉద్యోగంచేస్తే! బాగుంది. నాన్న ఏదో ఉద్యోగం ఇప్పించకమానడు. 'డైవోర్సు ఇస్తే'— మనస్సు.

'అమ్మో! మధుకు డైవోర్సు ఇవ్వ డమే. తను బతకగలదా?'

మధు వచ్చినతరువాత ఏ విషయమూ మాట్లాడాలి, సూటిగా మాట్లాడాలి అను కుంది సంధ్య అంతరాత్మ. ఎంత సేపటి నుంచి అలానే కూర్చుండిపోయిందో తెలియదు.

"అమ్మగారూ" పనిమనిషి.

"ఏం, అప్పలమ్మా."

"మీకోసం ఆ డాక్టరమ్మగారు వచ్చా రమ్మా"

ఉలిక్కిపడింది సంధ్య. "ఏ డాక్ట రమ్మ?"

"అదేనమ్మా, మన అయ్యగారి ఆసు పత్రిలో చేస్తదే- కల్పనమ్మగారు."

"ఎక్కడ?"

"ముందు హాల్లో కూకుండారమ్మా."

"సరే. నే వెళుతున్నా లే. నీ వెళ్ళి రెండు కాఫీలు చేసుకురా."

"నమస్తే" — కల్పన.

"నమస్తే" — సంధ్య.

"నా మేరేజ్." శ్రీకాంత్ అంటే మా బావే. స్టేట్స్‌లో వుంటున్నాడు. ఎక్కువ సెలవలు లేకపోవడంతో ఈ రోజు వస్తున్నారు. మేరేజ్ కాగానే ఇద్దరం వెళ్ళిపోతున్నాం" క్లుప్తంగా చెప్పింది.

"మీకు పాస్‌పోర్టు, వీసా, అవన్నీ ఇంత తక్కువ వ్యవధిలో ఎలా సంపా దించగలిగారు."

"తక్కువ వ్యవధి కాదండీ, ఒన్ ఇయర్ నుంచి ట్రై చేస్తున్నాం."

"సంధ్యగారూ, మీరు, మధు తప్పక రావాలి నా మేరేజ్‌కి."

సంధ్య అలానే కూర్చుండిపోయింది.

"సంధ్యగారూ! మళ్ళీ మీతో మాట్లాడే అవకాశం రాదనుకుంటాను. కాని నా మనస్సులోని ఆవేదనను మీతో ఒక్క మాట చెప్పాలని వచ్చాను. ఎందుకంటే ఇప్పుడు టైం లేదుకదండి చెప్పటానికి. మధులాంటి వ్యక్తికి ఏ ద్రోహం తలపెట్ట కండి. నేను ఒక మామూలు ఫ్రెండ్‌ని మాత్రమే. మీరు ఆయన జీవితం. మీరు లేకుంటే మధు లేడు. ఇది నిజం - ఇంత కంటే ఇంకేమీ చెప్పలేను-" కళ్ళలో అల లుగా వస్తున్న ప్రవాహం- "మీ ఇద్దరూ నా మేరేజ్‌కి వస్తారు కదూ!- వస్తానండి."

---

కొన్ని అలవాట్లు — పైపు




సంధ్య ఏదో చెప్పాలని నోరు తెరి చింది- కల్పన వేగంగా వెళ్ళిపోతూంది– అలానేనిలబడిపోయిందిగుమ్మంలోసంధ్య

"సంధ్యా."

"ఊఁ."

"ఏమిటి ఏదో ఆలోచిస్తున్నావు. ఇప్పుడే ఊరు వెళ్లాలని నిర్ణయించు కున్నావా?"

"ఏంటి? ఎంత సేపయింది మీరు వచ్చి. అయ్యో! నేను గమనించనేలేదే? త్వరగా భోంచేసి రెడీకండి. మళ్ళీ రేపు సన్‌డే కదా. షాప్సు వుండవు. కల్పనకు ఏదైనా ఒక మంచి ప్రజంటేషన్ కొనాలి"

మధు చిత్తరువులోని బొమ్మలాగ నిలిచిపోయాడు. తాను కలగనటంలేదు కదా. తాను మేల్కొనే ఉన్నానే అనే భావన.

"ఏయ్— ఏమిటి అలా నిలబడిపో యావు"- సంధ్య.

"నువ్వు - నువ్వు - సంధ్యవేనా?"

"ఆ! మీ సంధ్యనే."

అమాంతంగా పైకి ఎత్తేడు-"సంధ్యా, నీవెంత మంచిదానివో."

"ఆ, ఆ- ఆపండి, పాపం పెళ్ళాంపైన ఈగైనా వాలనివ్వడు. ఇంత బాధపెట్టిన 'సంధ్య' మంచిదట— మీకొక న్యూస్ చెప్పనా? వద్దులే రాత్రికి చెబుతాను"

"కాదు, నాకిప్పుడే కావాలి" మధు.

"మరి మరి" —

"త్వరగా చెప్పు సంధ్యా."

"మీరు నాన్న కాబోతున్నారట గదా!"

"అమ్మో! ఇంతమంచి న్యూస్ చెప్పి, ఒక స్వీట్ పెట్టవా? సంధ్యా? నాకేం ప్రజంటేషన్ ఇస్తావు."

"ఏమిటీ నేను మీకివ్వాలా? నాకు మీ రివ్వాలా, అదేం కుదరదు నీవే నాకివ్వాలి" సంధ్య.

"సరే! కోరుకొనుము ఇచ్చెదను కాంతామణీ!" - మధు

"నాకు ఎల్లకాలము నా పతిప్రేమను ప్రసాదించుము స్వామీ."

"అది ఏనాడో ఇచ్చితిని భామామణీ. ప్రతిఫలము ఏమి ప్రసాదించెదవు లలనామణీ."

"ఏడు మాసములు వేచి ఉండిన పుత్ర రత్నమును ప్రసాదించెదను."

నాటక పక్కిలో మాట్లాడుకుంటున్న వారి మాటలకు పైనున్న పిచ్చుక జంట కిచకిచమంటూ నవ్వినట్లనిపించి ఫక్కు మని నవ్వింది జంట. ఆ నవ్వుతో సంధ్యా రాగం పలుకుతుంది.